అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
బుధవారం 12 జులై 2023

ఖైరిగూడ ఓసీని సందర్శించిన డైరెక్టర్

నవతెలంగాణ-రెబ్బెన



మంగళవారం బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీని డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) జి వెంకటేశ్వర్ రెడ్డి బెల్లంపల్లి ఏరియా జీఎం జి దేవేందర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో ఉత్పత్తి, ఉత్పాదకత, సివిల్ పనులపై సమీక్షించారు. ఇన్‌ఫిట్ క్రషర్, ఖైరిగూడ ఓసీ నుండి డోర్లి(1)కు వెళ్లే రోడ్డు వంతెనను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం మచ్చగిరి నరేందర్, ఏజీఎం తిరుమలరావు, పీఓ సత్యనారాయణ, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ రాజాజీ, ఇన్‌చార్జి మేనేజర్ రాజేశ్వర్‌రావు, డీవైపీఎం నాగుల వేణు పాల్గొన్నారు.

మండల సమస్యలు పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-వాంకిడి

మంగళవారం ఎంపీపీ ముండె విమలాబాయి ఆధ్వర్యంలో కలెక్టర్ బొర్కాడె హేమంత్ సహదేవరావుకు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. మండలంలో బీసీ జనాభా ఎక్కువగా ఉండడం వల్ల మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సీట్ల సంఖ్యను 200 నుండి 300 వరకు పెంచాలని, లక్ష్మీనగర్ కాలనీవాసులకు ఇండ్ల స్థలాలు, ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే దారిలో రెడ్ డివైడర్ ఏర్పాటుచేయాలని, క్రీడా మైదానం, మినీ స్టేడియం ఏర్పాటుచేయాలని, అలాగే మండలంలోని వివిధ గ్రామాలకు బీటీ రోడ్ల పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వినతిపత్రంలో పేర్కొన్నారు.

పిల్లలున్నా..బోధకులేరీ..?

- సర్కారు బడుల్లో వేధిస్తున్న టీచర్ల కొరత
- సబ్జెక్టు ఉపాధ్యాయుల్లేక నష్టపోతున్న విద్యార్థులు
- ఏండ్లుగా నియామకాల్లేక సర్కారు బడులు నిర్వీర్యం
- సర్దుబాటులో భాగంగా ఎస్జీటీలతో బోధన

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని ఘనంగా చెబుతున్న ప్రభుత్వం ఉపాధ్యాయుల నియామకంలో మాత్రం నిర్లక్ష్యం కనబరుస్తోంది. అనేక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేక అందులో చదివే పేద విద్యార్థులు నష్టపోవాల్సి వస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 3317 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీటి పరిధిలో సుమారు 3.50లక్షల మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. కానీ వీరికి బోధించేందుకు సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తంటాలు పడాల్సి వస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏకంగా 1592 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ప్రభుత్వం 2017లో టీఆర్‌టీ పేరుతో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టింది. 2013వరకు ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులను పరిగణనలోకి తీసుకొని బోధకుల భర్తీని చేపట్టింది. కానీ 2014 నుంచి ఇప్పటి వరకు ఏర్పడిన ఖాళీ పోస్టులు వేల సంఖ్యలో ఉన్నప్పటికీ వీటి నియామకంపై ఎలాంటి దృష్టిసారించడం లేదు. ఫలితంగా ఉన్నత పాఠశాలల్లోనూ సబ్జెక్టు బోధకులు లేకుండా పోయారు. తాజాగా గత రెండేండ్ల నుంచి విద్యాశాఖ సర్దుబాటు పేరుతో ఖాళీగా ఉన్న బడుల్లో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ)లను నియమిస్తోంది. ప్రభుత్వ రెగ్యూలర్ నియామకాలు చేపట్టకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితిలో ఎస్జీటీలతో ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టుల బోధన చేయిస్తోంది.

చాలా చోట్ల సబ్జెక్టు టీచర్లు కరవు

ప్రస్తుతం ఉన్నత పాఠశాలల్లో గణితం, సాంఘీక, జీవశాస్త్రం బోధించే ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో విద్యాశాఖ అధికారులు వివిధ చోట్ల నుంచి ప్రాథమిక పాఠశాలల్లో బోధించే ఎస్జీటీలను ఉన్నత పాఠశాలల్లో నియమించి బోధన చేయిస్తున్నారు. ఈ పద్ధతి నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ ప్రత్యామ్నాయం లేకపోవడంతో ఎస్జీటీ ఉపాధ్యాయులు ఉన్నత పాఠశాలలకు బోధించాల్సి వస్తోంది. మరోపక్క చాలా ఉమ్మడి జిల్లాలో వేలాది పోస్టులు ఖాళీగా ఉండగా.. కేవలం వందల సంఖ్యలో మాత్రమే సర్దుబాటు చేసింది. దీంతో సర్దుబాటు చేసినా ఇంకా ఖాళీలు అనేకమున్నట్లు ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. మరోపక్క 2018 వరకు తాత్కాలిక ఉపాధ్యాయులు(విద్యావాలంటీర్లు)ను నియమించి సబ్జెక్టు బోధకుల కొరత తీర్చిన ప్రభుత్వం గత అయిదేండ్ల నుంచి వీరి నియామకం చేపట్టడం లేదు. మరోపక్క ఏకోపాధ్యాయ పాఠశాలల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. నిబంధనల ప్రకారం 30మంది విద్యార్థులు ఉంటే ఒక టీచర్..అంతకంటే ఒక్కరు ఎక్కువగా ఉన్నా ఇద్దరిని నియమించాలి. 60మంది దాటితే నలుగురు ఉపాధ్యాయులు ఉండాలి. కానీ చాలా ప్రాథమిక పాఠశాలల్లో 30మంది కంటే అధనంగా విద్యార్థులు ఉన్నప్పటికీ ఒకే ఉపాధ్యాయుడు పనిచేస్తున్నారు. ఏదేని కారణంగా సదరు ఉపాధ్యాయులు సెలవు పెడితే ఆరోజున బడి పిల్లలకు కూడా సెలవు ఇవ్వాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఈ సమస్య జిల్లాలో అనేక ఏండ్ల నుంచి ఉన్నా అటు ప్రభుత్వం.. ఇటు విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సర్కారు బడుల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. పిల్లల సంఖ్యకు అనుగుణంగా బోధకులు లేకపోవడం సర్కారు విద్యకు శరాఘాతంగా మారుతోంది. బడిబాటతో సర్కారు బడుల్లో పిల్లల సంఖ్య పెరిగిందని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం.. ఇందుకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తోంది. 2017లో టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ) ద్వారా నియామాలు చేపట్టిన ప్రభుత్వం.. 2013వరకు ఉన్న ఖాళీలను మాత్రమే భర్తీ చేసింది. తదనంతరం ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ అలసత్వం కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులే కాకుండా..నియామకాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు కూడా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.



ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఇది. ఇక్కడ 132మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి బోధించేందుకు కేవలం ముగ్గురు మాత్రమే రెగ్యూలర్ ఉపాధ్యాయులు ఉన్నారు. మిగితా నలుగురు ఎస్జీటీలను సర్దుబాటులో భాగంగా ఈ పాఠశాలకు పంపించారు. గత్యంతరం లేని పరిస్థితిలో ఆయా సబ్జెక్టులను వీరితో బోధన చేయిస్తూ నెట్టుకొస్తున్నారు.ఇలాంటి పరిస్థితి ఈ ఒక్క పాఠశాలకే పరిమితం కాలేదు. ఉమ్మడి జిల్లాలోని అనేక ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు బోధకుల కొరత తీవ్రంగా వేధిస్తోంది.

సర్దుబాటు సమస్యకు పరిష్కారం కాదు

-ఎ.వెంకట్, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి



ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా కేవలం సర్దుబాటు చేయడం సమస్యకు పరిష్కారం కాదు. ప్రభుత్వం నియామకమైన చేపట్టాలి లేదంటే తాత్కాలిక బోధకులనైనా నియమించాలి. అప్పుడే విద్యార్థులకు న్యాయం జరుగుతుంది. కింది స్థాయి అధికారులు కూడా ప్రభుత్వానికి సరైన ప్రతిపాధనలు పంపించకపోవడంతో ప్రభుత్వం దీనిపై శ్రద్ధ పెట్టడం లేదు. సర్దుబాటు ప్రక్రియ పూర్తికాకుండానే ఎఫ్ఎల్ఎం పరీక్షలు నిర్వహించడం సరికాదు. క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకొని వాటికి అనుగుణంగా నడుచుకుంటే బాగుంటుంది.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- భారీగా పట్టుబడిన డబ్బులు

నవతెలంగాణ-హాజీపూర్

వేంపల్లి మంచిర్యాల గార్డెన్స్‌లో సోమవారం అర్థరాత్రి పెద్ద ఎత్తున పేకాట అడుతున్నట్టు సమాచారం మేరకు హాజీపూర్ లోసులు స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పలువురిని అదుపులోకి తీసుకుని పెద్దఎత్తు డబ్బులు స్వాదీనం చేసుకున్నట్టు తెలిసింది. హాజీపూర్ ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. అర్థరాత్రి కొందరు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడగా.. వారి వద్ద నుండి రూ.లక్ష ఏడువేలు, పేక ముక్కలు జప్తు చేసుకున్నారు. మహారాష్ట్ర నుండి వచ్చిన కొందరు వ్యక్తులు గత కొన్ని నెలలుగా ఇక్కడ పెద్దమొత్తంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం. కాగా ఇక్కడి ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు గతంలో పేకాటలో పీడీ యాక్ట్ నమోదైన వారే ఈ ఆటను కొనసాగిస్తున్నట్టు తెలుస్తోంది. ఇంత కాలంగా ఈ తతంగం కొనసాగుతోందని కొందరికి తెలియటంతో పోలీసులు పట్టుకున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టుబడిన వారి ఫోటోలు ఇప్పటికీ పోలీస్‌లు మీడియాకు ఇవ్వకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.

ఎస్టీ హాస్టల్ వర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-నస్పూర్

ఎస్టీ హాస్టల్ వర్కర్ల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, ఆగస్టు 10వ తేదీలోపు వేతనాలు, ఏరియర్స్ చెల్లించాలని లేనిపక్షంలో 11వ తేదీ నుండి సమ్మె చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ట్రైనింగ్ కలెక్టర్ గౌతమికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో ఉన్నటువంటి గిరిజన ఆశ్రమ పాఠశాల, హాస్టల్లో పని చేస్తున్న డైలీ వైజ్, పార్ట్ టైం, అన్ని రకాల వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. నెల నెల రావాల్సిన వేతనాలు గత 8 నెలలగా ప్రభుత్వం చెల్లించడం లేదని, పెరిగిన వేతనాలు, పెండింగ్ ఏరియర్స్ కూడా ఇవ్వడం లేదని అన్నారు. గత కరోనా సమయంలో 42 రోజులు పని చేసిన వేతనం నేటికీ చెల్లించలేదని, ఒకవైపు ప్రతి రోజు నిత్యావసర ధరలు రోజు రోజుకి పెరుగుతుంటే, కుటుంబ పరిస్థితి, పిల్లల చదువులు, ఇంటి అద్దెలు కట్టడానికి ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చందు, లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షులు భీమయ్య, రమేష్, వెంకటేష్, బక్కయ్య, వజ్రమ్మ, లక్ష్మీ, భాగ్య పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష

- ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్

నవతెలంగాణ-రెబ్బెన

మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో వీధి దీపాలు సక్రమంగా పరిచేసే విధంగా సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు చూడాలన్నారు. అదేవిధంగా సమయపాలన పాటించాలని సూచించారు. మురికి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయాలి

నవతెలంగాణ-జన్నారం

తక్కువ కులమని కించపరుస్తూ దూషించిన కానిస్టేబుల్ సురేశ్‌ను సస్పెండ్ చేయాలని అంబేద్కర్ సంఘ మండల నాయకులూ బండ దేవేందర్, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు శ్రీపెల్లి జగన్మోహన్, శ్రీపెల్లి అంజన్న, లక్ష్మన్లు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలం కలమడుగు గ్రామానికి చెందిన శ్రీపెల్లి లక్ష్మన్‌ను చెరువుల పండుగ సమయంలో కులంపేరుతో దూషించి, కొట్టిన వ్యక్తి ప్రసాద్‌పై అట్రాసిటీ కేసు నమోదు కాగా, ఆ కేసు విషయంలో గ్రామ ఏపీఓ సురేశ్ గ్రామనికి చెందిన పలువురితో చర్చిస్తూ కులాన్ని కించపరుస్తూ బూతులు మాట్లాడటం జరిగిందన్నారు. శాంతిభద్రతలను రక్షించాల్సిన కానిస్టేబుల్ మాదిగల మనోభావాలను దెబ్బతినేలా బూతులు మాట్లాడటం సరికాదన్నారు. ఆయనలో మాకు ప్రాణ హాని ఉందని, వెంటనే ఉన్నత అధికారులు సురేష్‌ను సస్పెండ్ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గ్రామ ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశు కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీపెల్లి వెంకటేష్, అంజి, రామకృష్ణ, పాల్గొన్నారు.

డాంబర్ ప్లాంట్‌ను తరలించాలని వినతి

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని రాంపూర్ గ్రామానికి అతి సమీపంలో ఉన్న డాంబర్ ప్లాంట్‌ను మరో చోటుకు మార్చాలని డీవైఎఫ్ఐ నాయకులు తహసీల్దార్ మల్లిఖార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు చాపిడి పురుషోత్తం మాట్లాడుతూ పరిశ్రమల నుండి విష రసాయనాలు ఎక్కువగా విడుదల కావడంతో స్థానిక ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని వివరించారు. గ్రామానికి అతి సమీపంలో పరిశ్రమ ఉండడం వల్ల గ్రామస్తులకు చర్మ వ్యాధులతో పాటు అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చాపిడి శివ, మండల సహాయ కార్యదర్శి చల్లూరి అశోక్ పాల్గొన్నారు.



గ్రీన్ వుడ్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



సీబీఎస్‌ఈ పేరు చెప్పి రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న గ్రీన్ వుడ్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని మంగళవారం ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ఆ పాఠశాల కరపత్రాలను పాఠశాల ఎదుట దహనం చేశారు. అనంతరం ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి కూతవేటి దూరంలో గ్రీన్ వుడ్ పాఠశాల యాజమాన్యం ఎలాంటి అనుమతులు లేకుండానే సీబీఎస్‌ఈ విద్య అంటూ గ్లోబల్ ప్రచారం చేస్తూ అడ్మిషన్స్ తీసుకున్నారని అన్నారు. అంతేకాకుండా జీఓ ఎంఎస్ 1 ప్రకారం కాకుండా అధిక ఫీజులు వసూలు చేస్తూ నిబంధనలకు తూట్లు పొడుస్తూ అమాయక తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హమని, ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి గ్రీన్ వుడ్ పాఠశాల యాజమాన్యం చేస్తున్న మోసాన్ని అడ్డుకొని గుర్తింపు రద్దు చేయాలని లేని పక్షంలో ఆందోళనలు ఉదతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, టీవీయూవీ రాష్ట్ర కార్యదర్శి బచ్చలి ప్రవీణ్ కుమార్, విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు సల్మాన్, బీసీవీఎస్ జిల్లా అధ్యక్షుడు రేగుంట క్రాంతి కుమార్, టీవీఎస్ జిల్లా అధ్యక్షుడు, జాగిరి రాజేష్, టీబీఎస్ఎఫ్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు విద్యార్థి సంఘాల నాయకులు అన్నమయ్య పాల్గొన్నారు.

బృహత్ పల్లె ప్రకృతి వనంలో నాటిన మొక్కలపై విచారణ చేపట్టాలి

నవతెలంగాణ-కెరమెరి

జోడేఘాట్ బృహత్ పల్లె ప్రకృతి వనంలో నాటిన మొక్కలపై విచారణ చేపట్టాలని కుంరం భీం ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్ మంగళవారం ఎంపీడీఓ మహేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బృహత్ ప్రకృతి వనంలో సుమారు 2 వేల పై చిలుకు మొక్కలు మాత్రమే ఉన్నాయని ఎంపీడీఓకు తెలిపారు.18 వేల మొక్కలు నాటినట్లు రికార్డుల్లో నమోదు చేసినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. వనంలో నాటిన మొక్కలపై విచారణ చేపట్టి భాద్యులపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఎంపీడీఓకు వినతిపత్రం అందజేసిన వారిలో భీంరావు, మారుతి, లక్కెరావు, రాజు పాల్గొన్నారు.



జీపీ కార్మికు సమ్మెకు అడ్డంకులు

- పారిశుధ్య పనులు చేయించిన ఉపసర్పంచ్
- కార్యదర్శి అడ్డుకుకన్న ఆందోళనకారులు
- పోలీసుల జోక్యంతో కొనసాగిన పనులు
- పారిశుధ్య పనులను అడ్డుకున్న జీపీ కార్మికులు

నవతెలంగాణ-బెజ్జూర్

జీపీ కార్మికులు చేస్తున్న సమ్మెకు గ్రామాల్లో అడ్డంకులు ఎదురవుతున్నాయి. సమ్మె కొనసాగుతుండగా బెజ్జూర్ మండల కేంద్రంలో మంగళవారం గ్రామ ఉప సర్పంచ్ రాజేష్, కార్యదర్శి తుకారంలు దినసరి కూలీలతో పారిశుధ్య పనులు చేయించే ప్రయత్నం చేశారు. సమ్మెలో ఉన్న జీపీ కార్మికులు విషయం తెలుసుకొని పారిశుధ్య పనులను అడ్డుకున్నారు. తాము సమ్మెలో ఉండగా దినసరి కూలీలతో పారిశుధ్య పనులు ఎలా చేయిస్తారని వారితో వాగ్వివాదానికి దిగారు. తమ డిమాండ్లు పరిష్కారం అయ్యేంత వరకు గ్రామంలో పారిశుధ్య పనులు చేయించరాదని హెచ్చరించారు. దీంతో రెండు గంటల పాటు దినసరి కూలీలు పనిచేయకుండానే ఉండిపోయారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి తుకారం పంచాయతీ కార్మికులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ససేమిరా అన్నారు. కార్యదర్శి ఒక రోజు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టనివ్వాలని, లేదంటే మిమ్మల్ని తొలగిస్తామని హెచ్చరించారు. ఒక్క రోజు మాత్రమే పనిచేయిస్తానని వారికి దినసరి కూలీ మాత్రమే చెల్లిస్తామని చెప్పారు. జీపీ కార్మికులు వినక పోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చి వారి ప్రమేయంతో పారిశుధ్య పనులను చేపట్టారు.

వర్షంలోను ఆగని పోరాటం

హాజీపూర్ : పంచాయతీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు చేస్తున్న సమ్మె 6వ రోజుకు చేరింది. వర్షంలోను కూడా కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. డప్పు చప్పుళ్లతో రాపల్లి నుండి ర్యాలీగా వెళ్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వంట, వార్పుతో నిరసన తెలుపుతున్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ నాయకులు కేవి ప్రతాప్, వంగల దయానంద్ ,ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ చెన్నూరి సమ్మయ్యలు సంఘీభావం తెలిపారు.

పంచాయతీ కార్మికుల నిరసన ర్యాలీ.

దండేపల్లి : ఎన్నో ఏళ్లుగా పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మంగళవారం మండల పరిషత్ కార్యాలయం నుండి ర్యాలీగా వచ్చి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి వినతిపత్రం అందజేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు సాధించేవరకు ఆందోళన విరమించబోమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : కార్మికులందరూ ఐక్యతతో హక్కుల సాధనకై పోరాడాలని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టీయూడబ్ల్యూజేఐజేయూ) జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ అన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెకు జర్నలిస్టులతో కలిసి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్‌గౌడ్, టీయూడబ్ల్యూజే జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవునూరి రమేష్, టీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు సురేష్ చారి, రాందాస్, జిల్లా గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు శంకర్, జిల్లా సహాయ కార్యదర్శి రాజు, సంఘ నాయకులు సమ్మయ్య, దుర్గం ప్రసాద్, శ్రీను, సబిర్, నారాయణ, మహేష్, నాగేష్, కైలాష్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్ : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ కార్మికుల చేపడుతున్న సమ్మెలో భాగంగా మంగళవారం అర్థ నగ్న ప్రదర్శన నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి దీక్ష భూమి వరకు అర్ధనగన ప్రదర్శన చేసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు బి.రమేష్, దేవరాజ్, రాజు, శంకర్, మల్లేష్, రాజయ్య, పావని పాల్గొన్నారు.

రెబ్బెన : గ్రామ పంచాయతీ కార్మికుల 6వ రోజు సమ్మెలో భాగంగా మండలకేంద్రంలోని గంగాపూర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు బోగె ఉపేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 6వ రోజు గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెలో భాగంగా తమ హక్కుల సాధనకై నిరవదిక సమ్మె చేస్తున్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సుధాకర్, రమేష్, వెంకటేశ్, శ్రీనివాస్, లక్ష్మి, దేవాజీ, మహేందర్ పాల్గొన్నారు.

కాసిపేట : కాసిపేట మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె కొనసాగుతోంది. తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె విరమించేది లేదని పంచాయతీ కార్మికులు తేల్చి చెప్పారు. చాలీచాలని జీతాలతో ఇబ్బంది పడుతున్నామని, ఎటువంటి సౌకర్యాలు లేవని మా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు రోజు వారి నిరసన కార్యక్రమాలను చేపడుతామని ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతి కార్మికుల సంఘం నాయకులు దాసరి రాజయ్య, శ్యామ్, కటుక దీపక్, అట్ల మల్లేష్, వెంకటేష్, కరీం, విజయ్, శంకర్, తిరుపతి పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించబోమని, గ్రామపంచాయతీ సిబ్బంది నిరవధిక సమ్మెలో భాగంగా మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు వర్షాన్ని కూడా లెక్కచేయకుండా పంచాయతీ కార్మికులకు మంగళవారం సమ్మె కొనసాగించారు. ఉద్యోగ భద్రత కల్పిస్తూ జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విలాస్, వెంకటి, శ్యామ్ రావు పాల్గొన్నారు.

భీమారం : దీర్ఘ కాలికంగా ఎదుర్కొంటున్న తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన పంచాయితీ కార్మికులు సమ్మె మంగళవారం 6వ రోజు కొనసాగింది. తమను మల్టీపర్పస్ వర్కర్లుగా మార్చి తమకు పని భారం పెంచి శ్రమ దోపిడీ చేస్తున్నారని అన్నారు. చాలీ చాలని వేతనాలతో తమ భార్యా పిల్లలను పోషించుకోలేక అనేక ఇబ్బందులు ఎద్కొంటున్నామని వెంటనే తమ న్యామైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గడప గడపకు కాంగ్రెస్

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని కుంటాల, గోవింద్‌పూర్, పీచర గ్రామంలో మంగళవారం ఏఐసీసీ సభ్యులు డాక్టర్ నరేష్ జాదవ్ గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన డిక్లరేషన్‌లో పొందుపరిచిన హామీలను వివరించారు. రాబోవు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ నాయకులు జాదవ్ వసంత్‌రావు, గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్యాల కరుణాకర్, ఉపాధ్యక్షులు ఆరిఫ్‌ఖాన్, ఇచ్చోడ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ నాగనాథ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆసిఫ్‌ఖాన్, జిల్లా నాయకులు పవర్ రాజు, ఎస్టీ సెల్ నియోజవర్గ నాయకులు గణేష్, సుందర్ దత్త, కపిల్, గజానంద్ , రమేష్, కృష్ణ, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు నడువాలి

నవతెలంగాణ-బోథ్

రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం జై కిసాన్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కౌటా(బి) గ్రామంలోని మంగళవారం రైతు వేదికలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం చేయడానికి పనిముట్లు, వాటి వాడకం గురించి రైతులకు తెలియజేశారు. అనంతరం నాటు కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. రైతులకు రూ.80 వేల విలువ గల వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు అందించారు. ఈ సందర్భంగా తుల సుభాష్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు తుల అరుణ్ కుమార్ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సంతోష్, సర్పంచ్ రాధికా గంగాధర్, ఉపసర్పంచ్ రవీందర్, శ్రమశక్తి రైతు సంఘం సభ్యులు పూంద్రు శ్రీనివాస్‌రెడ్డి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మండలాల్లో పర్యటించిన కలెక్టర్



నవతెలంగాణ-బాసర

మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి పర్యటించారు. వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. కిర్గుల్(బి), ఓని, కౌట గ్రామాలను కలెక్టర్ సందర్శించారు. ఓని గ్రామంలో మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని చూసి పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మురుగు కాలువలలో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని, వర్షాలతో అంతర్గత రహదారులు దెబ్బ తినకుండ మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అంగన్‌వాడి కేంద్రాలను సందర్శించి, చిన్నారులకు పౌష్టికాహారం అందేలా చూడాలని అంగన్‌వాడీ టీచర్లకు ఆదేశించారు. మరో మారు మండలంలో పర్యటిస్తానని అప్పటికి గ్రామాలలో మార్పు రాకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ పర్యటన సాగుతుండటంతో వివిధ గ్రామాలలోని అధికారులు అప్రమత్తమయ్యారు. వీరి వెంట ఎంపీఓ మన్మోహన్ శాస్త్రి, ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులు, అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ముధోల్ : మండలంలోని విట్టోలి తండ గ్రామపంచాయతీలో మంగళవారం జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. డ్రైడేకు సంబంధించిన పనులను పరిశీలించారు. మురికి కాలువలు తీయాలని సూచించారు. నీరు నిల్వ ఉన్నచోట ఆయిల్ బాల్స్ వేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని ఆదేశించారు. వర్ష కాల దృష్ట్యా అధికారులు పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ భవనం, మనఊరు మనబడిని పరిశీలించారు. ఈ సందర్భంగా పలు విషయాలను ఎంపీడీఓ సురేష్ బాబును అడిగి తెలుసుకున్నారు. పలు సలహా సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజేష్, కార్యదర్శి గంగన్న ఉన్నారు.

కుమురం భీం విగ్రహానికి కంది శ్రీనివాస్‌రెడ్డి నివాళ్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జల్.. జంగిల్.. జమీన్.. కోసం పోరాటం చేసిన ఆదివాసీ యోధుడు కుమురం భీం ఆశయాలకనుగుణంగా నడుచుకోవాలని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమురం భీం చౌక్‌లో నూతనంగా ఆవిష్కరించిన భీం విగ్రహానికి మంగళవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం ఆదివాసులను చిన్నచూపు చూస్తోందని అన్నారు. పోడు రైతుల పూర్తి సాగుకు హక్కు పత్రాలివ్వకుండా కేవలం కొన్ని గుంటలకే పరిమితం చేసి ఎమ్మెల్యే జోగు రామన్న పోడుపట్టాల విషయంలో ఆదివాసులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో గిమ్మ సంతోష్, జిల్లా మైనారిటీ సెల్ చైర్మెన్ షకీల్, మన్సూర్, ఆసిఫ్, రహీమ్, సమీఉల్లాఖాన్ వసీమ్ రంజాని, మాజీ కౌన్సిలర్ గేడం అశోక్, షేక్ షాహిద్ పాల్గొన్నారు.

యువ పోరాట యాత్రకు లక్ష విరాళం

యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువ పోరాట యాత్రకు కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో తనవంతుగా రూ.లక్ష విరాళం అందించి కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. మావల వద్ద నుంచి ప్రారంభమయ్యే బైక్ ర్యాలీలో యువత వేలాదిగా పాల్గొని, ఓల్డ్ బస్టాండ్ వద్ద జరిగే కార్నర్ మీటింగ్‌ను జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో గిమ్మ సంతోష్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్‌గౌడ్, జిల్లా మైనార్టీ సెల్ చైర్మెన్ షకీల్, తహేర్ పాల్గొన్నారు.

పాఠశాలలో పోషక వనం ఏర్పాటు

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ప్యారమూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల అవరణలో పోషక వనం ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం విద్యార్థులకు కల్తీలేని కూరగాయలు అందించేందుకు ఈ పోషకవనంలో ప్రజా ప్రతినిధులతో కలిసి సేంద్రియ ఎరువులతో కూరగాయలు పండించేందుకు పాలకూర, మెంతి, టమాటా, క్యాబేజీ వంటి కూరగాయల విత్తనాలను నాటారు. అనంతరం గ్రామంలో హరితహారం మొక్కలను పంపిణీ చేసి మాట్లాడారు. నేటి మొక్కలే రేపు వృక్షాలై పండ్లను ఇస్తుందని పర్యవరణాన్ని రక్షిస్తాయాని సూచించారు. ఈకార్యక్రమంలో ఎఎంసీ చైర్మెన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, గ్రామసర్పంచ్ దివ్యారెడ్డి లింగారెడ్డి, ఎంపీటీసీ లయ కరుణాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ మోహన్‌రెడ్డి, డైరెక్టర్ సాయన్న, ఎంపీఓ తిరుపతిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణ, కార్యదర్శి సౌజన్య గ్రామస్తులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారీ వర్షాల వలన సమస్యలు ఎదురైతే తక్షణ సహాయం కోసం ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్-18004251939ను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో (రెయిన్ ఫాల్) కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా జిల్లా యంత్రాంగం పర్యవేక్షించడం జరుగుతుందని, సమస్యలు తలెత్తితే తక్షణ సహాయానికి టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రతి గ్రామంలో అభివృద్ధి జరగాలి : ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోథ్

ప్రతి గ్రామంలో అభివృద్ధి జరగాలని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. మండలంలోని సాంగ్వి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరు అయ్యాయి. దీనికి సోమవారం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి పోడు హక్కుల పత్రాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. అలాగే పలువురుకి మంజూరు అయిన పోడు భూముల పట్టాలను ఆయన చేతులు మీదుగా అందజేశారు. మావ నాటే మావ రాజ్ కళను సాకారం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. ప్రజలకు పరిపాలన చేరు చేశారని అన్నారు. అనంతరం మండలంలోని దన్నూర్ గ్రామం నుంచి నాగపూర్ గ్రామం వరకు నూతన బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు భూమి పూజ చేశారు. అలాగే ఐటీడీఏ ద్వారా రూ.2 కోట్ల 10 లక్షల నిధులతో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి, పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, సర్పంచ్ పంథాబాయి జగదీష్, బోథ్ సర్పంచ్ సురేందర్ యాదవ్, నాయకులు ఎలక రాజు, రుక్మాన్ సింగ్, రణమగౌడ్, పంద్రం శంకర్, రమేష్ పాల్గొన్నారు.

ముత్నూర్‌ను ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ముత్నూర్ గ్రామాన్ని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని ముత్నూర్‌లో ఆయన పర్యటించారు. జాతీయ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 అవార్డుకు ముత్నూర్ ఎంపికైనందున గ్రామంలో మౌలిక వసతుల కల్పనపై పంచాయతీ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ముత్నూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని అన్నారు. మురుగు నీటి కాలువలు, డ్రైనేజీలు పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని సూచించారు. ప్రతి ఇంటిలో మరుగుదొడ్డిని నిర్మించాలని అన్నారు. వాటిని వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించాలని అన్నారు. వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని సూచించారు. అంగన్‌వాడి, పాఠశాలలలో మరుగుదొడ్లు నిర్మించాలని అన్నారు. భవనాలకు రంగులు వేయాలని సూచించారు. బడి ఈడూ పిల్లలను బడిలో చేర్పించాలని అన్నారు. గ్రామంలోని రోడ్లు, ప్లాట్ల వారిగా నెంబర్లను వేయాలని పంచాయతీ అధికారులకు ఆదేశించారు. పచ్చదనం పెంపునకు హరితహారంలో విరివిగా మొక్కలు నాటాలని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని అన్నారు. అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ గ్రామంలో పర్యటించి, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, గ్రామ ముఖ్య కూడళ్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఎంపీడీఓ పుష్పలత, తహసీల్దార్ గంగాధర్, పంచాయతీ అధికారి సంతోష్, సర్పంచ్ బాగుబాయి, కార్యదర్శి సత్య నారాయణ, ఆశ వర్కర్ తిరుమల పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై కుట్రలు చేస్తే సహించేది లేదు

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు



నవతెలంగాణ-ఉట్నూర్

నియోజకవర్గంలో కొంత మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు తెర వెనుక కుట్రలు చేస్తూ పార్టీకి నష్టం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని అలాంటి వారిని సహించేది లేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. మంగళవారం ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీని విచ్ఛిన్నం చేసేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్న స్థానిక నాయకుల తీరుపై ఆయన మండిపడ్డారు. నియోజకవర్గానికి చెందిన మాజీ ఎంపీటీసీ భరత్ చౌహాన్, ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్‌లు గతంలో ఉన్న వారి పార్టీ పదవులకు రాజీనామా చేశారని గుర్తు చేశారు. కార్యకర్తలను తప్పుదోవ పట్టించడానికి ఒకరు రాష్ట్ర ఆదివాసీ విభాగం ఉపాధ్యక్షుడిగా, మరొకరు జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ప్రచారం చేసుకొంటూ పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తున్నారని ఆరోపించారు. నిజయోజకవర్గంలో పార్టీ బలోపేతాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీని నష్టపరిచే విధంగా ఎవరు ప్రవర్తించిన చూస్తూ ఊరుకునేది లేదని అయన స్పష్టం చేశారు. పద్ధతి మార్చుకోకపోతే అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామన్నారు. పార్టీ మండల అధ్యక్షుల నియామకాల్లో అనవసర రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. ఈ నెల నాలుగో తేదీన విడుదలైన మండల అధ్యక్షుల నియామకాల జాబితాలో కొన్ని పొరపాట్లు దొర్లయని గుర్తించిన అదిష్టానం దాన్ని సవరిస్తూ ఐదో తేదీన తాజా ఉత్తర్వులు జారిచేసిందన్నారు. పీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి అదిష్టానం సూచన మేరకే ఉత్తర్వులు జారీ చేశారని అయన గుర్తు చేశారు. కానీ కావాలనే కొంత మంది నాయకులు గ్రూప్‌గా ఏర్పడి నియోజకవర్గంలో కార్యకర్తల మధ్య గందరగోళం సృష్టిటిస్తున్నారని, పార్టీలో ఎ హోదా లేని వారిని కొత్త మండలాధ్యక్షులని సన్మానం చేయడం హాస్యాస్పదంగా ఉందని, ఈ విషయంలో భరత్ చౌహాన్, చారులతపై అదిష్టనానికి ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు అబ్దుల్ ఖయ్యూమ్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ లాజర్, నాయకులు దూట రాజేశ్వర్, మాణిక్ రావు, షేక్ సలీం, దేవనందం, ఇమ్రాన్, రాజ గౌడ్, భీమన్న ఉన్నారు.

దశాబ్దాల పోరాట ఫలితమే పోడు పట్టాల పంపిణీ



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని పిప్రి గ్రామపంచాయతీలో దశాబ్దాల ఆదివాసీ గిరిజనుల పోరాట ఫలితమే గిరిజనులకు తెలంగాణ ప్రభుత్వం పోడుపట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు అన్నారు. మంగళవారం పిప్రి రైతు సమావేశంలో మాట్లాడుతూ పోడు సాగులో అర్హులే ఉండి పేర్లు తొలగించబడిన వారికి రీసర్వే చేసి పోడు పట్టాలు ఇవ్వాలన్నారు. ప్రస్తుత ఏ సమస్యకైనా పోరాట మార్గమే సరైందని అన్నారు. పోడు భూములకు సర్వే చేసి ఏకరాలకు మాత్రమే పట్టాలు పంపిణీ చేసిందన్నారు. కొంత మందికి అన్యాయం జరిందన్నారు. రీసర్వే నిర్వహించి పోడు పట్టాలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ కుర్సెంగా సూర్య, గ్రామస్తులు మడావి సుభాష్, కొడప అశోక్, కుద్మేత మల్కు, దుర్వ శ్యామ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ వృత్తి నైపుణ్యత కలిగి ఉండాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

దేశంలోని ప్రతి ఒక్క యువతీ, యువకులు ఏదైనా శిక్షణలో వృత్తి నైపుణ్యత కలిగి ఉండటంతో ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వృత్తి నైపుణ్య శాఖ అధికారి ప్రశాంత్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకంలో భాగంగా బ్యూటీషియన్, టైలరింగ్ సెంటర్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. బయోమెట్రిక్ ప్రక్రియను సంబంధిత టీచర్లను అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీ ఏరియాలలో ఇటువంటి శిక్షణలు ఇవ్వడం వలన మహిళలు కుటుంబ పోషణలో భాగస్వాములు కావచ్చని ఆయన తెలిపారు. ప్రభుత్వాలు వెనుకబడిన ప్రాంతాలకు మరిన్ని శిక్షణ కార్యక్రమాలు అందిస్తుందని అన్నారు. ఇదివరకు నేర్చుకున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జన శిక్షణ సంస్థ చైర్మెన్ ఆర్ సురేందర్, జన శిక్షణ సంస్థ జిల్లా డైరెక్టర్ మేదరి శ్యామల, ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజన్న, సంతోష్, టీచర్లు దుర్గ, ప్రాచీ మహిళలు ఉన్నారు.

గిరిపుత్రికకు సన్మానం



నవతెలంగాణ-బోథ్

సొనాల మండలంలోని పార్డి(కె) గ్రామానికీ చెందిన మెస్రం నిరుపమ ఇటీవల పదో తరగతి పరీక్షల్లో 9.5 గ్రేడ్ సాధించింది. మోడల్ స్కూల్‌లో చదివి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినందుకు పార్డి(బి) రాయిసెంటర్ సార్‌మేడి తొడసం లక్ష్మణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.భూమన్న, మెస్రం నిరుపమను ఘనంగా సన్మానించారు. ఇలాంటి చదువులు చదవటానికి తల్లిదండ్రుల సహకరించినందుకు అభినందించారు. అలాగే తండ్రి మెస్రం భూమన్నను సన్మానించారు. కార్యక్రమంలో సార్‌మేడి లక్ష్మన్, ఆత్రం గంగాధర్, సర్పంచ్ జుగ్‌నాక్ మారుతి, ప్రధానోపాధ్యాయులు తులసి భూమన్న, సుంగన్న యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్టులోకి కొనసాగుతున్న వరద ప్రవాహం

నవతెలంగాణ-కడెం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కడెం ప్రాజెక్టులోకి వరద ప్రవాహం కొనసాగుతుంది. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు 7.603 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటిమట్టం 680 అడుగులు 3.470 టీఎంసీలలో కొనసాగుతుంది. ఇన్‌ఫ్లోగా ప్రాజెక్టులోకి 1200 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని తెలిపారు. ఇలాగే వర్షపాతం కొనసాగితే ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-దస్తురాబాద్

మండలంలోని రెవోజిపేట్ క్లస్టర్ పరిధిలోని కొత్తగా పట్టాలు వచ్చిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని క్లస్టర్ అధికారి కిరణ్ సూచించారు. ఈ సందర్భంగా రేవోజిపేట్ రైతు వేదికలో పలు గ్రామాల నుంచి వచ్చిన రైతుల దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా పట్టా వచ్చిన రైతులు, దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

యువ పోరాట యాత్రను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

రాష్ట్ర యువజన కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన యువ పోరాట బస్ యాత్ర ఇచ్చోడ మండల కేంద్రానికి చేరనున్న సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంఘీభావం తెలిపేందుకు తరలి రావాలని బోథ్ నియోజకవర్గ సీనియర్ నాయకులు ఆడే గజేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ యాత్ర వల్ల యువకుల్లో కొత్త ఉత్సాహం, జోష్ నింపగలుగుతామని తెలిపారు. మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో కార్నర్ మీటింగ్ ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ కార్యకర్తలు, కాంగ్రెస్ అభిమానులు, యువకులు, నాయకులు పెద్ద ఎత్తున హాజరై యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులు మహిముద్ ఖాన్, మండలాధ్యక్షుడు కళ్లెం నారాయణరెడ్డి, బోథ్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు పోతారెడ్డి, యూత్ మండల అధ్యక్షులు సయ్యద్ నౌషాద్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ చైర్మెన్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రాన్ని అందచేశారు. చైర్మెన్‌తో పాటు వైస్ చైర్మెన్ జహీర్ రంజానికి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ పలు సమస్యలను ప్రస్తావిస్తూ ఉర్దూ జర్నలిస్టులు అందించిన వినతిని ఎమ్మెల్యే జోగు రామన్న దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ తవక్కల్, గౌరవ అధ్యక్షులు మెహబూబ్ ఖాన్, గౌరవ ఉపాధ్యక్షులు హమీదుల్లా అన్వర్, ప్రధాన కార్యదర్శి ఖిజర్ అహ్మద్ యాఫై, సంస్థ కార్యదర్శి అమీమ్ షరీఫ్, కోశాధికారి ఆస్మత్ అలీ, క్రియాశీల సభ్యుడు ముహమ్మద్ షఫీ, వైస్ ప్రెసిడెంట్ ముహమ్మద్ ఆసిఫుద్దీన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరత తిర్చాలని రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు



నవతెలంగాణ-దస్తురాబాద్

మండలంలోని మున్యాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు ఒక్కరే ఉండటంతో అదనపు ఉపాధ్యాయులు కావాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ మహిళా సంఘం సభ్యులు మంగళవారం రోడ్డుపై ధర్నా చేశారు. 60 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ఒక్కరే ప్రధానోపాధ్యాయులు ఉండటం చేత విద్యార్థులు నష్టపోతున్నారని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ పాఠశాల వద్దకు చేరుకొని రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ధర్నాను విరమింపజేసి, విద్యార్థులకు హామీ ఇచ్చారు. వెంటనే జిల్లా విద్యాధికారికి చరవాణి ద్వారా సమాచారం అందించారు. అలాగే రెండు రోజులలో ఉపాధ్యాయున్ని వచ్చేలా చూస్తానని అన్నారు.

బంద్‌ను జయప్రదం చేయాలి

- వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు

నవతెలంగాణ-ఖానాపూర్

విద్యారంగ సమస్యల పరిష్కారానికై 12న బుధవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని వామపక్ష సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఖానాపూర్ పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌజ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు కావస్తున్న కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలను, ఏ గ్రూపు దుస్తులను ఇప్పటివరకు విద్యార్థులకు అందించలేకపోవడం చాలా సిగ్గుచేటని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు మన ఊరు - మన బడి, మన బస్తీ-మనబడి పథకం వర్తింపజేయాలని, పాఠశాలల్లో వెంటనే స్కావెంజర్ పోస్టులను భర్తీ చేసి పూర్తిస్థాయిలో మరుగుదొడ్లను నిర్మించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించి ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కళాశాలలు, పాఠశాలలు బంద్‌ను పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ, ఏఐఎస్బీ, ఏఐఎస్ఎఫ్, విద్యార్థి సంఘాల నాయకులు సింగరి వెంకటేష్, నిర్మల్ జిల్లా అధ్యక్షులు, దిగంబర్, రాష్ట్ర కార్యదర్శి జేవారే రాహుల్, కైలాస్, నవీన్ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టింది హెచ్‌పీ గ్యాస్ లారీ

నవతెలంగాణ-ఇచ్చోడ

ఇటీవల గుడిహత్నూర్ మండలంలోని మేకలగండి వద్ద ఈనెల 8న తెల్లవారు జామున ఆటోను వెనుక నుంచి ఢీకొట్టిన వాహనాన్ని పోలీసులు మూడు రోజుల్లోనే పట్టుకున్నారు. మంగళవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని సీఐ కార్యాలయంలో డీఎస్పీ నాగేందర్ విలేకరల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం... మృతుడు ఏముల పొచ్చన్న ఆదిలాబాద్‌లోని రాంనగర్‌కు చెందిన ఆల్వాలే గోవర్ధన్ వద్ద ఆటో అద్దెకు తీసుకొని తన భార్య, కూతుర్లు, అదే విధంగా ప్రేమ్ సాగర్, దీపక్‌రావు, తేజవర్ధన్‌లతో కలిసి ఇచ్చోడ మండల కేంద్రంలోని ఒక చర్చికి ప్రార్ధనలకు వచ్చారు. ప్రార్ధనల అనంతరం శనివారం తెల్లవారు జామున ప్రాంతంలో ఆటోలో ఇచ్చోడ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తున్న క్రమంలో గుడిహత్నూర్ మండలంలోని మేకలగండి వద్ద జాతీయ రహదారిపై ఆటోను లారీ వెనక నుంచి ఢీకొనడంతో నలుగురు మృతి చెందారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు, జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ధాబాల వద్ద గల సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా కేసును చేదించారు. ఆటోను ఢీకొన్న లారీ టీఎస్ 01 యూసీ 4400 ఇచ్చోడ మండల కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీకి సంబంధించిందేనని డీఎస్పీ తెలిపారు. లారీ డ్రైవర్ చాట్ల రజనీకాంత్ లారీని అజాగ్రత్తతో నడపడంతోనే ప్రమాదం జరిగిందని డీఎస్పీ పేర్కొన్నారు. లారీ గ్యాస్ సిలిండర్ కోసం మహారాష్ట్రలోని చంద్రపూర్‌కి శనివారం తెల్లవారు జామున సిలిండర్లు తేవడం కోసం వెళ్తున్న క్రమంలో ఆటోను వెనుక నుండి ఢీకొనడంతో ప్రమాదం జరిగిందనిడీఎస్పీ తెలిపారు. లారీ, ఆటోని ఢీకొనడంతో లారీ ముందరి భాగంలో ఉన్న బంపర్ డ్యామేజ్ అవ్వడంతో ఢీకొన్న ఆనవాళ్లు కనిపించకుండా లారీ డ్రైవర్ బంపర్‌కు కలర్ వేయించాడని అన్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను రిమాండ్‌కు తరలించి లారీని సీజ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ చంద్ర శేఖర్, ఎస్సైలు శ్రీకాంత్, సాయన్న, ప్రవీణ్, నీరేశ్ ఉన్నారు.

ఉద్యోగులు పెన్షన్ రథయాత్రకు కదలాలి

నవతెలంగాణ-ముధోల్

టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో చేపట్టే పాత పెన్షన్ సాధన సంకల్ప రథ యాత్రకు జిల్లాలోని అన్ని శాఖల్లో ఉన్న ఉద్యోగులు భారీగా తరలి రావాలని ఆ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షులు కొండన్నగారి కృష్ణారావు అన్నారు. మండలంలోని ఎడ్‌బిడ్ ఉన్నత పాఠశాల, ముధోల్లోని గిరిజన గురుకుల కళాశాల, గురుకుల కళాశాలలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీపీఎస్ విధానం రద్దు ఉద్యమంలో భాగంగా ఈనెల 24న నిర్మల్ జిల్లాలో రథయాత్ర కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా ఆగష్టు 12న హైదరాబాద్‌లో భారీ సభను కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి సీపీఎస్ ఉద్యోగిపై ఉందని ఆయన గుర్తు చేశారు. అనేక పోరాటాలు చేసి గ్రాట్యూటి, కుటుంబ పెన్షన్‌ను సాధించుకున్నామని అన్నారు. అదే స్ఫూర్తితో పూర్తి స్థాయి పాత పెన్షన్‌ను కుడా సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహా అధ్యక్షులు పంతిక రేవంత్, జిల్లా నాయకులు రవి జాదవ్, విఠల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రవిబాబు, నవీన్ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-సిరికొండ

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ వర్ణ అన్నారు. మంగళవారం మండలంలోని పొన్న, సుంకిడి గ్రామాలలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి ఓటు హక్కుపై అవగాహన కలిగించారు. ఓటు హక్కు అనేది రాజ్యాంగం ఇచ్చిన హక్కని అన్నారు. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ విలాస్ పాల్గొన్నారు.

www.navatelangana.com
నవతెలంగాణ
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 12 జులై 2023

దింద గ్రామానికి నిలిచిన రాకపోకలు

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండలంలో మంగళవారం కురిసిన వర్షానికి దింద వాగుపై ఉన్న లోలెవల్ వంతెనపై నుంచి వరద పొంగి పొర్లుతోంది. దీంతో దిందా గ్రామనికి రాకపోకలు నిచిపోయాయి. అధికారుల నిర్లక్ష్యంతో రాని అటవీ అనుమతులు, నిలిచిపోతున్న రాకపోకలు, ఇబ్బందుల్లో దింద గ్రామ ప్రజలకు వానాకాలం వచ్చిందంటే చాలు మండలంలోని దిందా గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబదాలు తెగిపోతున్నాయి. ఇంత చిన్నపాటి వర్షానికి ఇలా ఉంటే, భారీ వర్షాలు వస్తే మా గ్రామ పరిస్థితి ఏంటి అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయులే కార్మికులై

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



బలపంపట్టి పాఠాలు చెప్పే బడి పంతుళ్లు గరిట పట్టి వంట చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం మధ్యాహ్న భోజన కార్మికులు గత మూడు రోజులుగా సమ్మె చేపడుతున్న విషయం తెలిసిందే. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చే రోజు వారి డబ్బులకు వంట చేయడానికి ఎవరూ ముందుకు రావడంలేదు. దీంతో మంగళవారం తప్పని పరిస్థితిలో ఈజ్ గాం ఎంపీయూపీఎస్‌లో ఉపాధ్యాయులే వంట చేసి విద్యార్థులకు వడ్డించారు.

పద్మశాలి సంఘం ఎన్నికలకు సహకరిస్తాం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పద్మశాలి సంఘం జిల్లా ఎన్నికలకు పూర్తి సహకారం అందిస్తామని పద్మశాలి సేవా సంఘం మండల అధ్యక్షుడు కోమటిపల్లి లింగయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ అన్ని మండలాల కార్యవర్గ సభ్యుల నిర్ణయం మేరకు నిర్ణయించిన జిల్లా పద్మశాలి సేవా సంఘం ఎన్నికలను విజయవంతం చేస్తామన్నారు. సోమవారం పద్మశాలి భవనములో జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక నిర్వహించలేదని కేవలం ఎన్నికల నిర్వహణ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. పద్మశాలీల ఐక్యతను చెడగొట్టేందుకు కొంతమంది పలు సంఘాల పేరుతో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎన్నిక నిర్వహించినట్లు ప్రకటించి ప్రజలను అయోమయంలోకి నెట్టుతున్నారన్నారు. కుల బంధువులారా ప్రజాస్వామ్యబద్ధంగా ఈనెల 23న జిల్లా కేంద్రంలో పద్మశాలి సంఘం ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అల్లే శ్రీకాంత్, పట్టణ ప్రధాన కార్యదర్శి బొద్దున చందు, యువజన అధ్యక్షుడు సంజీవ్, మహిళా అధ్యక్షురాలు రాంపల్లి విజయ, మండల గౌరవ అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు, నాయకులు ఇరుకుల్ల మంగ, జంజిరాల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, వనం మధుకర్, తేలి మోహన్, అజయ్ పాల్గొన్నారు.

గుడుంబా స్థావరంపై దాడి

- 200 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం

నవతెలంగాణ-భీమిని

మండలంలోని చిన్న గుడిపేట పంచాయతీ లంబడితండా గ్రామంలో మంగళవారం ఎక్సైజ్ పోలీసులు, పోలీసలు గుడుంబా స్థావురాలపై సంయుక్తంగా దాడులు నిర్వహించారు. పోలీసు, ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నగుడిపేట గ్రామ పరిధిలోని లంబాడీతాండ కాలనీలో ఇండ్ల వద్ద నిల్వ ఉంచిన సుమారు 200 లీటర్ల గుడుంబాకు వినియోగించే బెల్లం పానకాన్ని ధ్వసం చేశారు. అజ్మీర సీతారాం అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గుడుంబా తయారు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్సై మహేందర్, ఎక్సైజ్ ఎస్సై నిర్మల పాటిల్, హెడ్ కానిస్టేబుల్ ఓదెలు, కానిస్టేబుల్ మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండవ ఏఎన్‌ఎంలు చేపట్టిన రెండు రోజుల సమ్మె ముగింపు సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దివాకర్‌తో కలసి కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారుగా 20 సంవత్సరాల నుంచి చాలిచాలని వేతనాలు తీసుకుంటూ, పేద, బడుగు బలహీన వర్గాల ఆరోగ్యాన్ని కాపాడంలో అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. సెకండ్ ఏఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించాలన్నారు. రెండు రోజుల సమ్మెకు పిలుపివ్వగా వారికి ఆన్‌లైన్ పనులను వెంటనే ఆపివేయాలని ఉత్తర్వు ఇచ్చారని, దీనితో మానసికంగా చాలా బాధలో ఉన్నారని అన్నారు. 100 శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని హెల్త్ ఇన్సూరెన్స్ రూ.పదిలక్షలు కల్పించాలని డిమాండ్ చేశారు. మరణించిన కుటుంబానికి ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, తక్షణమే పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, సాయంత్రం 6 దాటిన తర్వాత ఎలాంటి పనులు చెప్పవద్దని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు వెంటనే స్పందించి సెకండ్ ఏఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని లేనిపక్షంలో భవిష్యత్తులో నిరవధిక సమ్మెను చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 2వ ఏఎన్‌ఎంలు వసంత, సంతోషి, ప్రమీల పాల్గొన్నారు.

రైతు బీమా పథకంలో రైతుల వివరాలు నమోదు

నవతెలంగాణ-కౌటాల

రైతుబీమా పథకంలో రైతుల వివరాలు నమోదు చేసినట్టు వ్యవసాయ విస్తరణ అధికారి చౌదరి అంజన్న అన్నారు. మంగళవారం మండలంలోని తుమ్మిహేట్టి గ్రామ పంచాయతీలోని కొత్తగా వచ్చిన పోడు భూముల పట్టాల రైతుల వివరాలను నమోదు చేయడం కోసం పోడు రైతుల వివరాలను సేకరించినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 18 వరకు కొత్త పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు రైతు బీమా పథకంలో వివరాలు నమోదు చేసుకోవడానికి ఆగస్టు 5 చివరి గడువు అని అన్నారు. రైతు బీమా పథకంలో రైతులు వివరాలు నమోదై ఉండి, రైతు మరణించిన వారి కుటుంబానికి రూ.5లక్షల ప్రభుత్వం అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పథకానికి 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల మధ్య వయసు గల రైతులు అర్హులని ఆయన అన్నారు. మొత్తం పోడు భూముల రైతులు 57 మంది వివరాలను సేకరించినట్లు తెలిపారు. కావాల్సిన ధృవీకరణ పత్రాలు, దరఖాస్తు ఫారం, పట్టా పాస్ పుస్తకం, రైతు ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులు అందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోరెత్ చరణ్‌దాస్, పోడు గిరిజన రైతులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకొని మందులను వాడాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ విరివిగా వైద్య పరీక్షలు చేయించుకొని వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత సంబంధిత మందులను వాడాలని డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ బాబు అన్నారు. మంగళవారం ఏరియా వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న అధికారులకు, ఉద్యోగులకు డాక్టర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో బీపీ, షుగర్ పరీక్షలను చేశారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ ఉద్యోగులు ఎవరికైనా తీవ్రమైన తలనొప్పి, అలసట, ఛాతిలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది గుండె కొట్టుకోవడంలో మార్పు, తల తిరగడం, నీరసం వంటి సమస్యలు ఉన్నట్లయితే తప్పనిసరిగా బీపీ, షుగర్ సంబంధిత పరీక్షలు చేసుకుని, నివారణ తీసుకోవడానికి ప్రయత్నించాలని కోరారు. అలాగే ప్రతిరోజు ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు 30 నిమిషాలు వ్యాయామం చేయాలని అన్నారు. పోషక విలువలు ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవడం, ధూమపానం, మద్యపానం మానివేయడం వంటివి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లోకనాథ్‌రెడ్డి, ఏరియా వర్క్‌షాప్ ఎస్ఈ సతీష్ చక్రవర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- జిల్లాలో రెండో రోజు కొనసాగిన టోకెన్ సమ్మె



నవతెలంగాణ-జన్నారం

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి కూకటికారి బుచ్చయ్య అన్నారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులతో ఎంఈఓ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఇట్యాల కిషన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు 2022 మార్చి బడ్జెట్ సమావేశాల సందర్భంగా వేతనాలు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించినప్పటి నుంచి ఏరియర్స్ సహా జీఓ నెం.8 ప్రకారం ఇప్పటివరకు వారి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్త మెనూ సవరించాలని, పెండింగ్ బిల్లులు తక్షణం విడుదల చేయాలన్నరు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ అక్షయపాత్రకు అప్పచెప్పడాన్ని విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జువ్వాడి వసంత, అమృత, సేపూరి కార్య లక్ష్మి, జుంబర్తి లక్ష్మి, ఎలుక లక్ష్మి, ఎస్.లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుడ్ల రాజన్న పాల్గొన్నారు.

రెబ్బెన : సమస్యలు పరిష్కరించాలని మండలకేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ముందు మధ్యాహ్నభోజన కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజు కూడా కొనసాగింది. 2022 మార్చి 15న అసెంబ్లీలో మధ్యాహ్నభోజన కార్మికులకు రూ.రెండు వేలు పెంచుతున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించి 17 నెలలు కావస్తున్నా అమలుచేయకపోవడాన్ని నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మండలకేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ముందు 10, 11వ తేదీల్లో ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేసి 12న జిల్లా కలెక్టర్ ముట్టడి కార్యక్రమం చేపడుతామని కార్మికులు శపతం చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి పాగిడి మాయ, మండల అధ్యక్షురాలు రాంటెంకి విజయ, మండల సెక్రటరీ దుర్గం పద్మ, తానుబాయి, పోచవ్వ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్ : డిమాడ్ల సాధన కోసం ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు చేపడుతున్న టోకెన్ సమ్మె రెండవ రోజు కొనసాగింది. వారు మాట్లాడుతూ కార్మికులు గత 20 సంవత్సరాలుగా వెట్టిచాకిరి చేస్తున్నారని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు స్కూళ్లలో సరైన సదుపాయాలు లేకున్నా అప్పులు చేసి పిల్లలకు వంట చేసి పెడుతుంటే ప్రభుత్వం కనీసం సమస్య పరిష్కరించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్ కుమార్, శ్యామలి, గంగా, లక్ష్మి, కమల, బసంతి, లక్ష్మి, వైద్య పాల్గొన్నారు.

దహెగాం : డిమాండ్లు పరిష్కరించకుంటే మధ్యాహ్నభోజన కార్మికులు నిరవదిక సమ్మెకు వెళ్తామని సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో టోకెన్ సమ్మెలో భాగంగా వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ మధ్యాహ్నభోజన పథకం కార్మికుల యూనియన్ సీఐటీయూ రాష్ట్ర పిలుపు మేరకు టోకెన్ సమ్మె రెండో రోజు జిల్లాలోని అన్ని మండలాల్లోని ఎంఆర్సీ కార్యాలయం ముందు సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికులు, మండల నాయకులు పద్మ, పార్వతి, కవిత, లలిత, లక్ష్మి పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : మధ్యాహ్నభోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాయం ఎదుట రెండవ రోజు కొనసాగుతున్న టోకెన్ సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు కాంతమ్మ, ప్రధాన కార్యదర్శి రూప, కార్మికులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇప్పిస్తానని రూ.4లక్షలకు టోకరా

- మరో రూ.2లక్షలు ఇస్తానని రప్పించి పోలీసులకు పట్టించిన బాధితుడు
- మోసగాడిపై చీటింగ్ కేసు నమోదు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇప్పిస్తానని రూ.4లక్షలకు టోకరా వేసిన సంఘటన కాగజ్‌నగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. రూ.4 లక్షలు ఇచ్చిన బాధితుడు తాను మోసపోయానని గ్రహించి, మరో ఇల్లుకు రూ.2 లక్షలు ఇస్తానని మాయమాటలు చెప్పి అతన్ని రప్పించి తెలివిగా పోలీసులకు పట్టించడంతో ఇది వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... చింతలమానేపల్లి మండలం బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన ఎల్ములె పవన్ కుమార్‌కు బెల్లంపల్లికి చెందిన మహేష్ విజయ్ సాగర్ పరిచయమయ్యాడు. విజయ్‌సాగర్ గతంలో కాగజ్‌నగర్‌లో హౌజింగ్ డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్టు పద్దతిన వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసేవాడు. తాను రూ.4లక్షలు ఇస్తే కాగజ్‌నగర్‌లో డబుల్ బెడ్ రూం ఇల్లు ఇప్పిస్తానని పవన్‌కుమార్‌ను నమ్మించాడు. దీనితో పవన్‌కుమార్ రెండు పర్యాయాలుగా రూ.4 లక్షలు అతనికి ఇచ్చాడు. అప్పటి నుంచి విజయ్‌సాగర్ రేపు మాపు అంటూ తిప్పించుకుంటున్నాడు. దీనితో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు తెలివిగా మరో ఇల్లు కావాలని, రూ.2లక్షలు ఇప్పిస్తానని విజయ్‌సాగర్‌ను నమ్మించి కాగజ్‌నగర్‌కు రప్పించాడు. పెట్రోల్ పంపులోని ఒక హోటల్‌లో మాట్లాడుతుండగా పోలీసులను రప్పించి అతన్ని అప్పగించాడు. బాధితుని ఫిర్యాదు మేరకు విజయ్‌సాగర్‌పై ఛీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ బుద్దే స్వామి తెలిపారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది చేకూరుస్తానని మాయమాటలు చెప్పే వారిని నమ్మి ప్రజలు మోసపోవద్దని ఈ సందర్భంగా సీఐ సూచించారు.

సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు



నవతెలంగాణ-నస్పూర్

వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సముదాయ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ పి.గౌతమి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.సి.సుబ్బారాయుడుతో కలిసి జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య, బీసీ, ఎస్సీ సంక్షేమశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కీటక జనిత వ్యాధుల నియంత్రణకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలని తెలిపారు. నిల్వ నీటి వల్ల దోమలు వృద్ధి చెంది వ్యాధులు వ్యాపిస్తాయని అన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు యాంటీ లార్వా ఆపరేషన్ పకడ్బంధీగా అమలు చేయాలని అన్నారు. నిర్మాణ ప్రాంతాలు, రోడ్లపై గుంతలు, నివాస ప్రాంతాలలో నీటి నిల్వలను తొలగించాలని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ఫ్రైడే డ్రైడే, ఉదయం 10 గంటలకు 10 నిమిషాల కార్యక్రమాలను నిర్వహించాలని, పాఠశాలలు, కళాశాలల్లో పారిశుధ్యం పాటించేలా సంబంధిత అధికారులు దృష్టి సారించాలని అన్నారు. విద్యార్థులకు పరిశుభ్రతపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించాలని అన్నారు. విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులతో పాటు వారి చుట్టుప్రక్కల ప్రాంతాల వారికి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి, సంబంధిత మున్సిపల్, పంచాయతీ అధికారులు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. దోమలు వృద్ధి చెందకుండా స్ప్రేలు పిచికారీ చేయాలని తెలిపారు. ఈ నెల 20న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ క్రమంలో సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని అన్నారు. ఈ నెల 20, 27 తేదీలలో మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో మీజిల్స్, రూబెల్లా వ్యాధుల వ్యాప్తి నివారణ చర్యలలో భాగంగా చిన్నపిల్లలు, గర్భిణులకు వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇందు కొరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా స్థాయిలలో సిబ్బందికి శిక్షణ అందించడం జరుగుతుందని అన్నారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం ఆగస్టు నెలలో 7 నుంచి 12వ తేదీ వరకు, సెప్టెంబర్ 11 నుంచి 16వ తేదీ వరకు, అక్టోబర్ నెలలో 9 నుండి 14వ తేదీ వరకు మూడు దశలలో నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమ నిర్వహణ కొరకు చిన్నపిల్లలు, గర్భిణుల పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. బోదకాలు వ్యాధి నివారణ కొరకు మాస్‌డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమం ద్వారా అల్బెండోజోల్, డీఈసీ అవసరమైన మందులను పంపిణీ కేంద్రాల ద్వారా అందించడంతో పాటు ఇంటింటికి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. బోదకాలు వ్యాప్తి, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ

నవతెలంగాణ-హాజీపూర్

వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని చందనపూర్ గ్రామంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలతో ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బారాయుడు జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఫ్లకార్డులతో ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. అనంతరం జనాభా పెరుగుదలతో కలిగే ఇబ్బందులు, కుటుంబ నియంత్రణ తాత్కాలిక, శాశ్వత పద్దతులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు పాటించాలని సూచించారు. నేటి కుటుంబ ప్రణాళిక రేపటి ప్రగతికి సూచికగా భావించాలన్నారు. జనాభాను నియంత్రహించకపోతే అన్ని అనర్థాలే జరుగుతాయని అన్నారు. జనాభా ప్రాతిపదికన దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుందని, జనాభా ఎక్కువ ఉన్న దేశాలలో ప్రగతి కుంటుపడుతుందని అన్నారు. జనాభా నియంత్రణకు కృషి చేయాలనీ అన్నారు. ఈ కార్యాలయంలో



డిప్యూటీ డీఎంహెచ్ఓ అధికారులు డాక్టర్ విజయ, పూర్ణిమ, నీరజ, అధికారులు అనిత, విశ్వేశ్వర్ రెడ్డి, ప్రశాంతి, అల్లాడి శ్రీనివాస్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బురద మయంగా డీఎంహెచ్ఓ కార్యాలయం

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు డీఎంహెచ్ఓ కార్యాలయం ఆవరణ బురధమయంగా మారింది. కార్యాలయానికి వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. అడుగు తీసి అడుగు వేయరాని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి కార్యాలయం ఆవరణలో బురద లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షులుగా కనుకుల రాకేష్

నవతెలంగాణ-కాసిపేట

రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేన రెడ్డి, జిల్లా అధ్యక్షులు తాళ్ల సంపత్‌రెడ్డిలు కాంగ్రెస్ పార్టీ కాసిపేట మండల యూత్ అధ్యక్షులుగా తనకుల రాకేష్‌కు నియామక పత్రాన్ని మంగళవారం అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా మీద నమ్మకంతో భాధ్యతలను అప్పగించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కొక్కిరాల సురేఖమ్మ, ఏఐసీసీ సభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, దీనికి సహకరించిన బెల్లంపల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ముడిమడుగుల మహేందర్, కాసిపేట మండల అధ్యక్షులు వేముల కృష్ణ, మాజీ మండల అధ్యక్షులు సిద్ధం తిరుపతి, మండల ఎంపీటీసీలు పార్వతి మల్లేష్, మెరుగు శంకర్‌పద్మ, భీమ్‌రావ్ అలాగే మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు యువతకు నా ప్రత్యేక ధన్యవాదాలు పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తానని, మండలంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.



ఓవర్ బర్డెన్(ఓబీ) కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఉపరితల గని ఓవర్ బర్డెన్ (ఓబీ)లో పనిచేస్తున్న వాల్వో, డంపర్ ఆపరేటర్, లైట్ మోటర్ వెహికల్ డ్రైవర్లు, సూపర్‌వైజర్లను విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు కోరారు. మంగళవారం శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ పురుషోత్తం రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఉపరితల గనిలో టెండర్ దక్కించుకొని పనిచేస్తున్న సీఆర్ఆర్ కంపెనీ స్థానికులకు అవకాశం కల్పించకుండా ఆసిఫాబాద్ లాంటి ఇతర ప్రాంతాల వారిని తీసుకువచ్చి స్థానికులకు ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సర్వ శ్రీనివాస్, తోట రాజేష్, రాచర్ల రాజేశం, సుంకరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పట్టణాధ్యక్షునికి సన్మానం

నవతెలంగాణ-జన్నారం

కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడిగా నియమితులైన దుమల రమేష్‌ను అంబేద్కర్ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మంగళవారం జన్నారం మండల కేంద్రంలోని పొన్కల్ గ్రామపంచాయతీ ఆవరణలో అంబేద్కర్ సంఘం జన్నారం మండలాధ్యక్షులు సిటీ మల భరత్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు రమేష్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలు అంబేద్కర్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

రైతు భీమా దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని భూరేపల్లి గ్రామంలో కొత్తగా భూమి పట్టా పాస్ పుస్తకం వచ్చిన రైతుల నుంచి రైతు భీమా కోసం దరఖాస్తులకు ఆన్‌లైన్ నమోదు చేసిన వ్యవసాయ అధికారి కృపామని స్వీకరించారు. రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు రైతు బీమా దరఖాస్తు చేసుకొని రైతులు రైతు బీమా దరఖాస్తు చేసుకోగలరు. భూమి యజమాని (పట్టాదారు) రైతు మరణిస్తే రైతు బీమా ద్వారా నామినికి రూ.ఐదు లక్షలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్నందున, 18 నుండి 59 సంవత్సరం లోపు వారు ఈ అవకాశానికి అర్హులు అని తెలిపారు. ప్రతి ఒక్క రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతు భీమా దరఖాస్తు ఫారం, భూమి పట్టా పాస్ పుస్తకం, భూమి యజమాని (పట్టదారు) ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డ్, జీరాక్స్‌లు తిసుకొని స్వయంగా పట్టాదారు రైతు వచ్చి దరఖాస్తు ఫారం ఇవ్వాలన్నారు.

బెజ్జూర్ : మండలంలోని సోమిని గ్రామ పంచాయతీ రైతువేదికలో కొత్తగా పట్టా పాస్ పుస్తకాలు వచ్చిన రైతుల నుండి రైతు బీమా కోసం దరఖాస్తులు స్వీకరించినట్టు ఏఈఓ శ్రీధర్ తెలిపారు. ఇప్పటివరకు రైతు బీమా దరఖాస్తు చేసుకోని రైతులు రైతుబీమాకు దరఖాస్తులు చేసుకోవాలని, పట్టాదారు రైతు మరణిస్తే రైతు బీమా ద్వారా నామినీకి రూ.5 లక్షల సాయం అందుతుందన్నారు. దరఖాస్తు చేసుకొనే రైతులు రైతు బీమా దరఖాస్తు ఫారం, పట్టా పాస్ పుస్తకం, పట్టాదారు ఆధార్ కార్డ్, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-జన్నారం

రూ.500 కోట్లతో గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని గల్ఫ్ సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమన్న అన్నారు. మంగళవారం మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు భుక్య లక్ష్మణ్ నాయక్‌కు రూ.24400 ఆర్థిక సాయం అందించారు. లక్ష్మణ్ నాయక్ గుండె వ్యాధితో బాధపడుతున్న సందర్భంలో గల్ఫ్ సంక్షేమ సమితి రాంపూర్ గ్రామస్తులంతా చందాలు వేసుకొని అతనికి ఆర్థిక సాయం చేయడం జరిగిందని కల్లెడ భూమన్న తెలిపారు. కార్యక్రమంలో వేల్పుల రాయలింగు, వెంకటేష్, వేముల సత్తయ్య, సంతపురి దుబ్బయ్య పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

18 సంవత్సరాలు నిండి అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా ఓటరు నమోదు నోడల్ అధికారి కాంపెల్లి ఊశన్న సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని చైతన్య, మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005 అక్టోబర్ 1న లేదా అంతకు ముందు జన్మించిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. రానున్న పది రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ఓటర్ నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. విద్యార్థులు వెంటనే తమ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది వెంకటేష్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహర్ సమస్యలు గుర్తించాలని ఆర్ఎస్పీకి వినతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

తెలంగాణలో మహర్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కు మహర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి దీపక్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. జాడి దీపక్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో నేతకానిలుగా, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో మాలలుగా, కొన్ని ప్రాంతాల్లో ఇన్నర్ మహార్‌లుగా, వేర్వేరు పేర్లతో కుల ధృవీకరణ పత్రాలు ఇస్తున్నారని తెలిపారు. అందరికి మహర్ కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని అన్నారు. మహార్‌ల పెద్ద పండుగ పొలాల అమావాస్య, బులయ్ పండుగలకు ప్రభుత్వం సెలవు ప్రకటించి ప్రభుత్వం ఖర్చులతో అధికారికంగా నిర్వహించాలని అన్నారు.

ఎస్ఆర్పీ1 గనిలో భద్రతపై అవగాహన

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ 1 గనిలో మంగళవారం భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నా భద్రత నా బాధ్యత, నా భద్రతే నా కుటుంబ బాధ్యత అనే అంశంపై శ్రీరాంపూర్ ఏరియా రక్షణ అధికారి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఏరియా రక్షణ అధికారి శ్రీధర్ రావు మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే అందరూ ఎస్ఎంపి, ఎస్ఓపిలను పాటించాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంతో ఉద్యోగులలో రక్షణ ప్రాముఖ్యతని పెంపొందించుకోవాలని, జీరో వర్క్ టార్గెట్ సాధించాలని సూచించారు. రక్షణ పరికరాలతో కంపెనీ నియమాలను పాటిస్తూ ఉండాలని కోరారు. ఆ విధంగా పాటించినప్పుడే ప్రమాదరహిత సింగరేణి గా తీర్చిదిద్దుకోవచ్చని తెలిపారు. ప్రమాదాలు జరుగకుండా చూసుకోవాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిదని అన్నారు. ప్రతి సింగరేణి ఉద్యోగి, యాజమాన్యం, యూనియన్ నాయకులు అందరూ కలిసి కట్టుగా ప్రమాద నివారణకు పాటు పడినప్పుడే, జీరో వర్క్ సింగరేణిగా మార్చుకోవచ్చునని తెలిపారు. గని ఏజెంట్ గోపాల్ సింగ్ మాట్లాడుతూ గనుల్లో ప్రతీ క్షణం అప్రమత్తతతో పని చేయాలని అన్నారు. పనిస్థలాల్లో వ్యక్తిగత రక్షణ పరికరాలు వినియోగించాలని, రక్షణ సూత్రాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మానిటర్లు, ఇంప్లిమెంటర్లు ఎస్ఎంపి అంశాలను చక్కగా అర్థం చేసుకుని అమలు పరచాలని సూచించారు. రక్షణే ధ్యేయంగా తెలిపే సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ తమ రోజు వారి విధిలో తప్పక పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ విజయ్ కుమార్, గని రక్షణ అధికారి రాజేష్, డివైపీఎం పాలకుర్తి రాజు, యూనియన్ ప్రతినిధులు గని అధికారులు పాల్గొన్నారు.

వడ్డెర కులస్తులకు న్యాయం చేయాలి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండల కేంద్రంలో వడ్డెర కులస్తుల ముఖ్యకార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా అధ్యక్షుడు సంపంగి ప్రభాకర్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా వడ్డెర కులస్తుల బతుకులు మాత్రం మారలేదని అన్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితుల్లో ఉన్నారని అన్నారు. ప్రభుత్వం వడ్డెర కులాన్ని చిన్నచూపు చూడకుండా అత్యంత దుర్భర జీవితం గడుపుతున్న వడ్డెర కులానికి కూడా దళితబంధు తరహాలో వడ్డెర బంధు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. వడ్డెర సామాజిక వర్గం 1976 కంటే ముందు డీఈ నోటిఫైడ్ ట్రైబ్స్‌లో ఉండేదని అన్నారు. 1976 తర్వాత బీసీల్లో కలిపి వడ్డెర కులానికి తీరని అన్యాయం చేశారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దండుగుల సాయిలు, తమ్మిశెట్టి మారుతి, ర్యాపనీ జుక్కన్న, ద్యారంగుల నాగరాజు, ద్యారంగుల శంకర్, ర్యాపనీ రాములు, మక్కళ సాయినాథ్, ద్యారంగుల శంకర పాల్గొన్నారు.

అదృశ్యమైన విద్యార్థుడిని తల్లిదండ్రులకు అప్పగింత

నవతెలంగాణ-బాసర

నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ యూనివర్సిటీ విద్యార్థి మిస్సింగ్ అయిన కేసును మంగళవారం పోలీసులు చేధించి తల్లిదండ్రులకు అప్పగించినట్టు పోలీసులు తెలిపారు. దీంతో యూనివర్సిటీ అధికారులు, తల్లిదండ్రులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈనెల 6వ తేదీ గురువారం యూనివర్సిటీ నుంచి బయటకు వెళ్లిన మెదక్ జిల్లా తూప్రాన్ మండలం నర్సంపల్లికి చెందిన బన్నీ బాసర రైల్వేస్టేషన్‌లో ఇంటర్ సిటీ ట్రైన్ ఎక్కి మహారాష్ట్రలోని పర్బని జిల్లా, పూర్ణ పట్టణానికి వెళ్లిన అనంతరం తన మొబైల్‌ను స్విచ్ ఆఫ్ చేశాడు. విద్యార్థి బన్నీ చివరి మొబైల్ లొకేషన్ పూర్ణ పట్టణం చూపెట్టింది. దీంతో పోలీసుల బృందం మహారాష్ట్రలోని పర్భాని జిల్లా పూర్ణ పట్టణానికి వెళ్లి మహారాష్ట్ర పోలీసుల సహకారంతో బన్నీ ఆచూకి తెలుసుకొని తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

బీసీలంతా ఏకం కావాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజ్యాధికార సాధనే లక్ష్యంగా బీసీలంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాసగౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని రజక సంఘ భవనంలో నిర్వహించిన బీసీల రాజకీయ ప్లీనరికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆదిలాబాద్‌కు చేరుకున్న ఆయనకు బీసీ సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. ముందుగా రిమ్స్ వద్ద గల చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. అనంతరం సభ వేదిక వద్దకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలు, పూలబోకేలతో సత్కరించారు. తెలంగాణ వచ్చి 9 ఏండ్లు గడుస్తున్నా బీసీల బతుకులు మారలేదన్నారు. అత్యాధిక జనాభా కలిగిన ఉన్న బీసీలకు స్వరాష్ట్రంలో అడుగడుగునా తీరని అన్యాయం జరుగుతోందన్నారు. తక్కువశాతం జనాభా ఉన్నవారే ఇవాళ అధికారపీఠంపై కూర్చుని రాజ్యమేలుతున్నారన్నారు. రాజకీయంగా బీసీలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అందుకే బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి రాజ్యాధికార సాధనే లక్ష్యంగా పోరాటాలకు సన్నద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్‌తో పాటు పలువురు బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాల పెంపుదల జీఓను విడుదల చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

కార్మికులకు కనీస వేతనాల పెంపుదల జీఓను విడుదల చేయాలని, కార్మికులకు కనీస పెన్షన్ రూ.6వేలు చెల్లించాలని ఆగస్టు 4న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే.రాజన్న అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్మిక వర్గానికి నేడు అందుతున్న వేతనాలతో జీవనం గడవడం కష్టంగా మారిందన్నారు. ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, కుటుంబాలు పోషణ భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు సంక్షేమాలను గాలికి వదిలేసిందని అన్నారు. ఉచితాల పేరుతో సబ్సిడీ కోత లాంటి ప్రజావ్యతిరేక విధానాలు పాలకులు కొనసాగిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. 2016 సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలని అన్నారు. ఈ నేపథ్యంలో కార్మిక వర్గానికి పిలుపునిస్తూ ఆగస్టు 4న హైదరాబాద్‌లో నిర్వహించే కార్మిక గర్జన ధర్నాకు వేలాది మంది కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బక్కన్న, కే.లక్ష్మీ ఆర్.రామలక్ష్మణ్, ఎస్.గంగన్న , ఎండీ గఫూర్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెండింగ్ బిల్లులు చెల్లించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళన చేపట్టారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గత 20 సంవత్సరాలుగా బడి పిల్లలకు వండిపెడుతున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంటాల రాములు అన్నారు. జీఓ 8 ప్రకారం పెంచిన వేతనం, మూడు వేలు అమలు చేయాలని అన్నారు. పెండింగ్ బిల్లులు, వేతనాలు విడుదల చేయాలని, కోడిగుడ్లకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. వంట గ్యాస్ సిలిండర్‌ను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని పేర్కొన్నారు. ప్రమాదబీమా, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలను వర్తింపజేయాలన్నారు. ఈ సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు వినోద, నాందేవ్, లక్ష్మీ, సుజాత, రాంబాయి, పుష్ప, కవిత పాల్గొన్నారు.

అన్ని సంఘాలను సమానంగా గుర్తించాలి

- జాతీయ సంఘాల నాయకులు



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు నిర్వహించేంతవరకు గనిలో అన్ని సంఘాలను సమానంగా గుర్తించాలని జాతీయ సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం జాతీయ సంఘాల ఆధ్వర్యంలో ఆర్కే 6 గని మేనేజర్‌కు మెమోరండాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణిలో ఎన్నికలు జరిగి ఏడు సంవత్సరాలు గడుస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించకుండా యాజమాన్య, ప్రభుత్వాలు కార్మికులను మోసం చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ అధికారులను, సింగరేణి అధికారులను తమ చెప్పు చేతుల్లో పెట్టుకొని ఎన్నికలు జరగకుండా కుట్ర చేస్తుందని ఆరోపించారు. డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ జాతీయ సంఘాలను ఎన్నికలు అయ్యేంతవరకు కార్మికుల సమస్యలపై పరిష్కారం కొరకు అనుమతించాలని కోరినప్పటికీ ఇటు యాజమాన్యంగాని, అటు ప్రభుత్వం గానీ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. అలాగే గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఏడు సంవత్సరాలు గడుస్తున్న అధికారిక కార్యక్రమాలు మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ ఇతర కమిటీలు నిర్వహిస్తూ గుర్తింపు సంఘానికి ఆ పేరు తోటి ఉచిత మాస్టర్లు ఇస్తూ వారిని ఇంకా ప్రోత్సహిస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు. అందువల్ల వెంటనే ఇలాంటి అధికారిక కార్యక్రమాలు రద్దు చేయాలని, ఒకవేళ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని అనుకుంటే అన్ని సంఘాలను సమాన ప్రాతిపదికన పిలిచి సమావేశాలు నిర్వహించాలని అన్నారు. అందరిని సమానంగా చూడాలని లేనిపక్షంలో సింగరేణిలో ఎలక్షన్‌లు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలా కాని పక్షంలో సింగరేణి గుర్తింపు సంఘం తోటి నిర్వహిస్తున్న అన్ని అధికారిక కార్యక్రమాలను అడ్డుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ముస్కే సమ్మయ్య, చిలుక రామచందర్, తోట మహేష్, బత్తుల క్రాంతి కుమార్, వై సంపత్ కుమార్, సీఐటీయూ నాయకులు సాయిళ్ల శ్రీనివాస్, మహేష్, ఐఎన్‌టీయూసీ నాయకులు వేల్పుల ప్రవీణ్ కుమార్, జయకర్, బీఎంఎస్ నాయకులు గోపతి సందీప్ కుమార్, నాగార్జున పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెకు సర్పంచ్‌ల మద్దతు

నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలో గత వారం రోజులుగా పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తున్నారు. వారికి మద్దతుగా మంగళవారం మండల సర్పంచ్‌లు మద్దతు తెలిపారు. ముందుగా పారిశుధ్య కార్మికులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న మల్టిపర్పస్ వర్కర్స్‌కి సర్పంచ్‌ల తరపున మద్దతు తెలిపామని అన్నారు. తెలంగాణ సీఎం పారిశుధ్య కార్మికులకు పెద్ద మనసు చేసుకొని వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు సదానందం, సర్పంచ్‌లు స్వప్న రత్న ప్రకాష్, కేశవరెడ్డి, యశ్వంత్ నాయకులు అరుణ్, కుమార్ పరమేశ్వర్, నరేందర్, మండల పారిశుధ్య కార్మికుల అధ్యక్షులు ప్రధాన్ శంకర్, ఉపాధ్యక్షులు విలాస్, ప్రధాన కార్యదర్శి ప్రమోద్, సంఘ సభ్యులు అన్నారు.

సిరికొండ : మండల పంచాయతీ కార్మికుల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆత్రం జలపతి, ఉపాధ్యకుడుగా బత్తుల రాజు, కార్యదర్శిగా పంద్రం విజయ్, కోశాధికారిగా కాబ్లే దినేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పైకు, విజయ్, శ్రీనివాస్, గౌరు, ఎల్లుబాయి పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : గత ఐదు రోజుల నుంచి తమ సమస్యల పరిష్కారానికి, తమ డిమాండ్ల సాధనకై మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ కార్మికులకు బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సుంకేట పోశెట్టి మద్దతు తెలిపారు. ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే పంచాయతీ కార్మికుల డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. వెంటనే కార్మికుల వేతనాలను పెంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు రమణ, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



తాంసి

బాసర : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట మంగళవారం పంచాయతీ పారిశుధ్య, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, కార్మికులు నిరసన చేపట్టారు. పంచాయతీ కార్మికులందరూ తమ విధులు మానేసి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్షుడు దేవరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం 11వ పీఆర్సిని అమలు చేయాలని రూ.19వేలు వేతనం చెల్లించాలని అన్నారు. జీఓ నెంబర్ 51 సవరించి, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. జీఓ నెంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. ప్రమాదం జరిగి మరణించిన కార్మికుని కుటుంబానికి రూ.10లక్షల నష్ట పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో పారిశుధ్య కార్మికులు గంగాధర్, దేవన్న, నగేష్, సరుబాయి, కిరణ్, భీమ్, అప్రోచ్ లాయక్ గంగాధర్ పాల్గొన్నారు.

దస్తురాబాద్ : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్యాల సర్పంచ్ నగవత్ సురేష్ నాయక్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె ఆరో రోజుకు చేరుకుందని అన్నారు. ఈ సందర్భంగా సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు మద్దతు తెలియజేశారు. గ్రామపంచాయతీ కార్మికుల డిమాండ్లు న్యాయబద్ధమైనవని వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.



బాసర



దస్తురాబాద్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ నిరసన



ఆదిలాబాద్‌టౌన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, న్యాయబద్ధమైన డిమాండ్లు నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనం నుంచి ర్యాలీగా తరలివచ్చి కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జీఓ నెంబర్ 8 ప్రకారం వేతనాలను ఏరియర్స్‌తో సహా చెల్లించాలని అన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణను అక్షయపాత్ర వంటి స్వచ్ఛంద సంస్థలకు అప్పగించే ఆలోచనను వెంటనే విరమించుకోవాలన్నారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని అన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. కొత్త మెనూను సవరించి అందుకు తగ్గట్టుగా బడ్జెట్ కేటాయించాలని పేర్కొన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. ప్రమాదబీమా, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులను ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. అక్రమ తొలగింపులు అరికట్టాలన్నారు. లేనిపక్షంలో పోరాటాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, తెలంగాణ మధ్యాహ్నం భోజనం పథకం నాయకులు లక్ష్మి రేఖ, పోసాని, సంగీత, కిష్టమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

కడెం : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం కడెం, దస్తురాబాద్ మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పదేపదే రాష్ట్ర ప్రభుత్వానికి చెబుతున్నా ఇప్పటివరకు ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. జులై 10, 11, 12 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం బంద్ చేపడుతున్నామని అన్నారు. జులై 13 వరకు ప్రభుత్వం స్పందించకపోతే జులై 14 తర్వాత సమ్మెలోకి వెళ్తున్నామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాధా మాట్లాడుతూ విద్యార్థులకు అందించే భోజనాన్ని ప్రయివేట్ సంస్థలకు అప్పజెప్పడాన్ని మేము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. మాకు పెంచిన గౌరవ వేతనాన్ని నెలలు గడిచిన ప్రభుత్వం ఇప్పటిదాకా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ 08 ప్రకారం పెరిగిన వేతనాలతో సహా వెంటనే చెల్లించాలని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వెంటనే మెనూ చార్జీలు పెంచాలని అన్నారు. ప్రతి కార్మికురాలికి ఐడి కార్డు, యూనిఫాంలు ఇవ్వాలని అన్నారు. వంట సామాగ్రి ఇవ్వాలన్నారు. కోడిగుడ్లు ఉచితంగా, గ్యాస్‌ను సబ్సిడీ ద్వారా అందించాలని అన్నారు. పై సమస్యలు ప్రభుత్వం పరిష్కారం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన పోరాటాలకు సిద్ధమవుతామని అన్నారు. జులై 12న జిల్లా జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. నిర్మల్ జిల్లాలో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికులు ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు రవీంద్ర, మండల కార్యదర్శి ఎంకవ్వ, బుచ్చవ్వ, స్వరూప, కలవ్వ, గంగవ్వ, పోసవ్వ, శంకరయ్య, వినోద, స్వప్న, రాజవ్వ దస్తురాబాద్ మండలం అధ్యక్షురాలు కార్యదర్శి శంకరవ్వ, లింగవ్వ, రజిత, రాజ్యలక్ష్మి, మమత పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : నర్సాపూర్(జి)మండల కేంద్రంలోని మధ్యాహ్న భోజనకార్మికులు విద్యా వనరుల కేంద్రంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ నవీన్‌కు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాన్న భోజన కార్మికులు మాట్లాడుతూ 2022 మార్చ్ బడ్జెట్‌లో తమ వేతనాలు పెంచుతున్నామని ప్రకటించినప్పటి నుంచి ఏరియర్స్‌తో సహా జీఓ నంబర్ 8 ప్రకారం వేతనాలు చెల్లించాలని అన్నారు. కొత్త మెనూ సవరించాలని అన్నారు. పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని అన్నారు. మధ్యాహ్న భోజన పథక నిర్వహణ అక్షయపాత్రకు అప్పజెప్పడం విరమించుకోవాలని అన్నారు. సమస్యలన్నీ పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జూలై 10వ తేదీ నుంచి 12 తేదీ వరకు మూడు రోజులపాటు వంట చేయడం మానివేసి ఒకే సమ్మె చేస్తున్నామని తెలియజేశారు. రాజకీయ వేధింపులు ఆపివేయాలని, అక్రమ తొలగింపులను అరికట్టి తమకు గుర్తింపు కార్డులను అందించాలని కోరారు. ప్రమాదబీమా అందించాలని, వంట పాత్రలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు ద్వారా రుణాలు అందించాలని, మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలానికి చెందిన ఆయా పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.



కడెం



దిలావర్‌పూర్

ఉచిత విద్యుత్ ఇవ్వకుండా రైతులకు అన్యాయం చేసిందే కాంగ్రెస్

నవతెలంగాణ-కెరమెరి

ఉచిత విద్యుత్ ఇవ్వకుండా రైతులకు అన్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీనేనని ఎంపీపీ పెందూర్ మోతీరాం, వైస్ ఎంపీపీ సయ్యద్ అబ్దుల్ కలాం అన్నారు. మంగళవారం ఉచిత విద్యుత్ అవసరం లేదంటూ కాంగ్రెస్ పార్టీ నాయకుల ప్రకటనకు నిరసనగా మంగళవారం సాంగ్వి, ఖైరి గ్రామాల్లోని రైతు వేదికల వద్ద బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం రైతుబంధు లాంటి పథకాన్ని అమలు చేయలేదన్నారు. దీన్ని జీర్ణించుకోలేక విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ, రైతు వ్యతిరేక ఆలోచనా విధానాలను అవలంబిస్తుందని ఆరోపించారు. మరోసారి తన రైతు వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ పార్టీ బయటపెట్టుకుందని విమర్శించారు. తెలంగాణ రైతాంగం, తెలంగాణ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జగన్నాథ్‌రావు, ఎంపీటీసీ సకరాం పాల్గొన్నారు.



వందశాతం విద్యార్థులు పాఠశాలకు హాజరు కావాలి

- ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన పీఓ చాహత్ బాజ్ పాయ్



నవతెలంగాణ-నార్నూర్

ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు వందశాతం హాజరవ్వాలని ప్రధానోపాధ్యాయులకు ఐటీడీఏ పీఓ చహత్ బాజ్‌పాయ్ సూచించారు. మంగళవారం మండలంలోని జామడ బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. వర్షాకాలం వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి జాగ్రత్తలు వహించాలన్నారు. విద్యార్థులను నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన భోజనం పెట్టాలని ఆదేశించారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు పాఠాలు బోధించి చదివించారు. ముగ్గురు విద్యార్థులు సరిగా చదవలేదని వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. మొక్కలు నాటి మంచి వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వారి వెంట డీడీ దిలీప్ కుమార్, ఏటీడీఓ క్రాంతి కుమార్, హెచ్ఎం నెహ్రూ, పీడీ విశ్వనాథ్ ఉపాధ్యాయులు మేస్రం మల్కు విశ్వనాథ్, ప్రేమ్‌కుమార్ హరిచంద్, కైలాష్, పుష్పలత, గంగాధర్, శివాజీ, చంపావతి, సుజాత, రాజ్యలక్ష్మి, బాలాజీ, రాజు, రవి, సుభాష్ ఉన్నారు.

రైతులపై కక్ష్య సాధింపు చర్య

- డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి
- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ఖండన
- నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైతులకు మూడు గంటల విద్యుత్ ఇస్తే సరిపోతుందన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అన్నదాతలకు అండగా ఉంటూ ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తోందన్నారు. మూడు గంటల విద్యుత్ మాత్రమే సరిపోతుందని రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ విధానాలకు అద్దం పడతాయని అన్నారు. కాంగ్రెస్ హయంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత వ్యవసాయ రంగానికి ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం పెద్ద ఎత్తున ధర్నాలు చేపట్టనున్నామని తెలిపారు. నిరసనలో రైతులు పాల్గొనాలని అన్నారు. సమావేశంలో జిల్లా రైతు సమన్వయ అధ్యక్షుడు రోకండ్ల రమేష్, మార్కెట్ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, గంగారెడ్డి, పోతారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, జంగిలి ప్రశాంత్, పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్‌లో చేరనున్న మాజీ మున్సిపల్ చైర్మెన్

నవతెలంగాణ-నిర్మల్



మాజీ మున్సిపల్ చైర్మెన్ అప్పాల గణేష్‌తో పాటు ఇతర నాయకులు బీజేపీని వీడి గులాబీ గూటికి చేరనున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లో కలిశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపుకు సమిష్టిగా కృషి చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. పని చేసే వారిని బీఆర్ఎస్ పార్టీ గుర్తించి సముచిత స్థానం కల్పిస్తుందని తెలిపారు. నిర్మల్ మున్సిపాలిటీ అభివృద్ధికి తమ తోడ్పాటు ఎప్పుడు ఉంటుందని ఆయన భరోసానిచ్చారు. అయితే బుధవారం నిర్మల్ జిల్లా జిల్లా కేంద్రంలోని బైల్‌బజార్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం నుంచి దివ్యాగార్డెన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. అప్పాల గణేష్‌తో పాటు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు, యువకులు, కుల సంఘాల నాయకులు గులాబీ కండువా కప్పుకోనున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, నాయకులు ఎర్రవోతు రాజేందర్, రాంకిషన్‌రెడ్డి, అల్లోల గౌతంరెడ్డి, ధర్మాజీ రాజేందర్, రామేశ్వర్‌రెడ్డి, మారుగొండ రాము, నేరేళ్ల వేణ, కత్తి నరేందర్, సైండ్ల శ్రీధర్, మాజీ కౌన్సిలర్లు చందుపట్ల రవి, తోట నర్సయ్య, గోపు గోపి, నేల అరుణ్ కుమార్, సాకీర్, అలీం పాల్గొన్నారు.

నేడు భవన నిర్మాణ పనులు బంద్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఐదు ప్రధాన డిమాండ్లు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ బుధవారం భవన నిర్మాణ పనులను బంద్ చేసి నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్టు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పోశన్న అన్నారు. స్పందించని పక్షంలో దశలవారీగా ఆందోళనలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మిక సంఘ భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా తరలివెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్టు తెలిపారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యేను కలుస్తామని అన్నారు. కార్మికులు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా ఇండ్లు లేని నిరుపేద కార్మికులకు ఇంటి స్థలాలు మంజూరు చేసి, ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సొంత స్థలాలు ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం ఆర్థికసాయం అందించాలన్నారు. 55 ఏండ్లు దాటినవారికి ఐదు వేల పింఛన్ ఇవ్వాలని అన్నారు. అర్హులైనవారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేయాలని అన్నారు. పనులు బంద్ చేసి నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు.